sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 05-08-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 120 EDITOR: ROHINI



గాంధీయిజం జిందాబాద్

కాక్రోచ్ జనతా పార్టీ అభిజిత్ దీప్కే పిలుపు

- మహాత్ముడి మార్గమే భారతదేశానికి దిక్సూచి
- విదేశీ హింస, విప్లవాలు మనకొద్దని స్పష్టీకరణ
- భారత రాజ్యాంగమే ఆయుధమని వెల్లడి
- నేపాల్, బంగ్లాదేశ్ ఆదర్శం కాదని ఉద్ఘాటన

న్యూఢిల్లీ కేంద్రంగా రగులుతున్న విద్యార్థి ఉద్యమంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కీలక వ్యాఖ్యలు చేశారు. పొరుగున ఉన్న బంగ్లాదేశ్, నేపాల్ తరహా హింసాత్మక లేదా తీవ్రవాద పోరాటాలను మన దేశానికి వర్తింపజేయకూడదని ఆయన స్పష్టం చేశారు. భారత విద్యార్థి లోకం కేవలం మహాత్మా గాంధీ చూపించిన శాంతియుత అహింసా మార్గంలోనే తమ హక్కుల సాధనకు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఢిల్లీ వేదికగా చేపట్టిన ఆందోళనలను మసిపూసి మారేడుకాయ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న వేళ, విద్యార్థులు రాజ్యాంగానికి లోబడే తమ పోరాటం సాగిస్తున్నారని ఆయన ప్రకటించారు.

- సహనం వందే, న్యూఢిల్లీ

ఢిల్లీలో జరిగిన విద్యార్థి నిరసనలను బంగ్లాదేశ్ లేదా నేపాల్‌లలో తలెత్తిన రాజకీయ సంక్షోభాలతో పోల్చడంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన మంగళ వారం ఒక వార్తా సంస్థతో మాట్లాడారు. మన దేశంలోని విద్యార్థుల ఆందోళనను చెడుగా చిత్రీకరించేందుకు, ప్రజాస్వామ్య బద్ధమైన నిరసనలపై బురద చల్లేందుకే ఇటువంటి పోలికలు తెస్తున్నారని ఆయన ఆరోపించారు. పోలీసుల నుంచి తీవ్రస్థాయిలో ఆటంకాలు, హద్దులు దాటిన చర్యలు ఎదురైనప్పటికీ నిరస నకారులు ఎక్కడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోలే దని గుర్తుచేశారు. భారత్ ఒక బలమైన రాజ్యాంగ వ్యవస్థ కలిగిన దేశమని, ఇక్కడ అహింసాత్మక మార్గంలోనే పాలకుల విధానాల ను ప్రశ్నించగలమని ఆయన పేర్కొన్నారు.

నీట్ బాధితులకు పరిహారానికి డిమాండ్

ప్రవేశ పరీక్షల ప్రక్రియలో జరిగిన లోపాల వల్ల ఆత్మహత్యలు చేసుకున్న నీట్ అభ్యర్థుల కుటుంబాలకు ఇంతవరకు పరిహారం అందకపోవడంపై దీప్కే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తక్షణమే పరిహారం చెల్లించా లని, కానీ ప్రభుత్వం ఈ విషయంలో తీవ్ర జాప్యం చేస్తోందని నిలదీశారు. విద్యార్థుల మర ణాలకు కారణమైన లోపాలను దిద్దుకోకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సమర్థనీయ మని ప్రశ్నించారు. బాధితుల కుటుంబాలకు తగిన న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు.

విద్యావ్యవస్థలో సమూల మార్పుల ఆవశ్యకత

దేశంలో నీట్ వంటి కీలక పోటీ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరగడం వల్ల కోట్లాది మంది అభ్యర్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళుతుందని దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియలో విపరీతమైన జాప్యం జరగడం, విద్యావ్యవస్థపై పాలకులకు నిర్లక్ష్యం పెరిగిపోవడం యువతను మానసిక వేదనకు గురిచేస్తోందన్నారు. వెంటనే నియామక సంస్కరణలు చేపట్టాలని, విద్యా రంగానికి ఇచ్చే ప్రాధాన్యతను, బడ్జెట్ కేటాయింపులను భారీగా పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శాంతియుత ఉద్యమాలపై అణచివేత ధోరణి

పోలీసు యంత్రాంగం, రాజ్యవ్యవస్థ శాంతియు తంగా నిరసన తెలిపే విద్యార్థులపై కఠినంగా వ్యవహరించడాన్ని ప్రజాస్వామ్యవాదులు ఖం డించాల్సిన అవసరం ఉందన్నారు. చట్టప్రకారం శాంతియుతంగా ఆందోళనలు చేపట్టే హక్కు ప్రతీ పౌరుడికి ఉందని, అయితే విద్యార్థుల నిర సనలను నిర్బంధాలతో ఆపాలని చూడటం భావప్రకటనా స్వేచ్ఛను కాలరాయడమేనని విమర్శించారు.ప్రభుత్వం తన అణచివేత చర్యల ను పక్కనబెట్టి, విద్యార్థులు లేవనెత్తుతున్న అస లైన సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు.

గాంధేయ మార్గమే భారతదేశానికి దిక్సూచి

రాజకీయ స్వేచ్ఛ, హక్కుల సాధనకు హింస ఏమాత్రం పరిష్కారం కాదని... మహాత్మాగాంధీ చూపిన బాటలోనే భారత ప్రజాస్వామ్యం నిలబడి ఉందని దీప్కే ఉద్ఘాటించారు. దేశ యువత విదేశీ పోకడలకు లోనుకాకుండా మన రాజ్యాంగ విలువలకు కట్టుబడి తమ ఆందోళనలను కొనసాగించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిధిలోనే ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావచ్చని, విద్యావ్యవస్థలో పారదర్శకత తీసుకొచ్చేందుకు ఇదే ఏకైక మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు.

అభిజిత్ దీప్కే

ముగింపు లేని పోరాటం...

బాధిత విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వం ఇంకా నిర్లక్ష్యం వహిస్తే దేశవ్యాప్తంగా నిరసనలను మరింత ఉధృతం చేస్తామని దీప్కే హెచ్చరించారు. పరీక్షల విశ్వసనీయతను కాపాడటం, మరణించిన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వడం, నియామకాలలో పారదర్శకత తీసుకురావడంపై పాలకులకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

బీహార్‌లో భగ్గుమన్న విద్యార్థి లోకం

జైళ్లలోని విద్యార్థుల విడుదలకు డిమాండ్

- నీట్ నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై వేధింపు
- పాట్నా వీధుల్లో హోరెత్తిన నినాదాలు
- పోలీసుల అత్యుత్సాహం బట్టబయలు

నీట్ పేపర్ లీక్ కుంభకోణానికి వ్యతిరేకంగా గతంలో అరెస్టయిన విద్యార్థుల విడుదల కోసం పాట్నా వీధుల్లో వందలాది మంది మరోసారి రోడ్డెక్కడంతో బీహార్ రాజకీయం వేడెక్కింది. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడుతూ సీఎం నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన నిరసనకారులపై పోలీసులు నీటి ఫిరంగులను ప్రయోగించి అణచివేసే ప్రయత్నం చేశారు. - సహనం వందే, పాట్నా

నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్, డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తదితర సంఘాల జెండాలు పట్టుకున్న ఆందోళనకారులు మొదట గాంధీ మైదాన్‌లో భారీగా గుమిగూడారు. అక్కడి నుంచి నేరుగా ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి నివాసాన్ని ముట్టడించడానికి దూసుకెళ్లారు. గమ్యస్థానానికి రెండు కిలోమీటర్ల దూరంలోనే పోలీసులు భారీ బారికేడ్లను ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. జైళ్లలో మగ్గుతున్న విద్యార్థులందరినీ వెంటనే విడుదల చేయాలని, వారిపై నమోదు చేసిన క్రిమినల్ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జైళ్ల నుంచి విడుదలైన వారి జాబితాతో పాటు ఇంకా లోపల ఉన్న వారి వివరాలతో కూడిన జాబితాను తమకు చూపించాలని నిరసనకారులు అధికారులను నిలదీశారు.

బంద్ నాటి అణచివేత...

గత నెలలో నాటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ నిర్వహించిన రాష్ట్రవ్యాప్త బంద్ సమయంలో బీహార్ పోలీసులు దాదాపు 600 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో మైనర్లుగా తేలిన దాదాపు సగం మందిని వదిలిపెట్టగా... మిగిలిన వారిని నేరుగా జైళ్లకు తరలించారు. ఈ అరెస్టులపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ వినయ్ కుమార్‌ను కలిసింది. ఆ భేటీ తర్వాత విద్యార్థులపై ఉన్న అన్ని క్రిమినల్ కేసులను ఉపసంహరిస్తామని, జైళ్లలో ఉన్న వారిని విడుదల చేస్తామని రాష్ట్ర హోంశాఖ అధికారికంగా ప్రకటించింది. కానీ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పడంతో విద్యార్థుల్లో అసంతృప్తి కట్టలు తెంచుకుంది.

ఇళ్లకు తిరిగి రాని విద్యార్థులు

ప్రభుత్వం ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, తమ స్నేహితులు ఇంకా ఇళ్లకు తిరిగి రాలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల మాటలు పచ్చి అబద్ధమని, జైళ్లలో ఉన్న తమ సహచరుల భద్రతపై తీవ్ర ఆందోళన చెందుతున్నామని ఆందోళనకారులు నినాదాలు చేశారు. ఏకే 47 రైఫిల్‌తో విద్యార్థులపై కాల్పులు జరిపిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారని, అయితే తన కింది సిబ్బందిని ఉన్మాదులుగా మార్చిన ఎస్పీపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆ కార్యకర్త డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు పూర్ణియా ఎంపీ పప్పు యాదవ్, బీహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ రామ్ మద్దతు తెలిపారు.

పోలీసుల జోక్యం అరెస్టుల పర్వం

నిరసనకారులను అణచివేసే క్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ రామ్‌తో పాటు పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని తరలించారు. ఈ మొత్తం వ్యవహారం ఇప్పుడు బీహార్ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రభుత్వంపై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. ఒకవైపు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై నీటి ఫిరంగులు ప్రయోగించడం, మరోవైపు హామీలిచ్చి మోసం చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శకులు మండిపడుతున్నారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

డాబర్ తేనె పూసిన కత్తి

తేనె స్వచ్ఛత వెనుక పచ్చి మోసం

- ఆ బ్రాండ్ ఉత్పత్తులపై కేంద్రం నిషేధం
- వినియోగదారులను మోసం చేసిన కంపెనీ
- మోసపూరిత ప్రకటనలతో బురిడీ

బలానికి మంచిది కదా అని మనం కళ్లు మూసుకుని నమ్మే డాబర్ బ్రాండ్ వెనుక అసలు ఎంత పెద్ద మోసం దాగుందో తెలిస్తే దిమ్మ తిరిగిపోతుంది. స్వచ్ఛతకు మారుపేరు అని గొప్పలు చెప్పుకునే ఈ దిగ్గజ సంస్థ ప్రజల నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి ఎలా దోచుకుంటుందో ఇప్పుడు ఆధారాలతో సహా బయటపడింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇచ్చిన దెబ్బకు ఆ సంస్థ నోరెళ్ల బెట్టింది.

- సహనం వందే, న్యూఢిల్లీ

మనం ఎంతో నమ్మకంతో రోజూ సేవించే తేనె, ఆవు నెయ్యి, యాపిల్ సైడర్ వెనిగర్ వంటి అత్యంత కీలకమైన ఆహార పదార్థాల విషయంలో డాబర్ ఇండియా సంస్థ చేసిన ఘోరమైన మోసం ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రంగంలోకి దిగి ఆ సంస్థకు చెందిన ఉత్పత్తుల అమ్మకాలపై అత్యవసర నిషేధాజ్ఞలు జారీ చేశారు. కోట్లాది మంది ప్రజలు ఆరోగ్యకరమైనవి అని నమ్మి కొనుగోలు చేస్తున్న వస్తువులపైనే ఇలాంటి వేటు పడటం ఆ సంస్థ నైతిక దిగజారుడుతనానికి నిదర్శనం కాదా.

మోసపూరిత ప్రకటనలు

కంపెనీ తన వెబ్‌సైట్‌లో విక్రయిస్తున్న తినుబండారాలపై వంద శాతం సహజం, వంద శాతం స్వచ్ఛత, వంద శాతం స్వచ్ఛతకు హామీ, వంద శాతం ఆర్గానిక్, వంద శాతం లేత కొబ్బరి నీళ్లు అంటూ ప్రచారం చేస్తోంది. ఈ ప్రకటనలన్నీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలింది. అసలు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేకపోయినా, ఎలాంటి ప్రామాణికత లేకపోయినా కేవలం వినియోగదారులను బురిడీ కొట్టించడమే లక్ష్యంగా ఈ భారీ ప్రచార ఆర్భాటాలకు తెరలేపారు. అమాయక ప్రజలు ఈ పెద్ద పెద్ద ప్రకటనలను చూసి మోసపోతారనే ఉద్దేశంతోనే పక్కా ప్లాన్ ప్రకారం ఈ అబద్ధపు ప్రచారాన్ని హోరెత్తించారు.

లోగోల దుర్వినియోగం

డాబర్ హిమాలయన్ ఆర్గానిక్ ఆపిల్ సైడర్ వెనిగర్, డాబర్ ఆర్గానిక్ తేనె ఉత్పత్తులపై ఎలాంటి సరైన ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆర్గానిక్ అనుమతి లేకపోయినా జైవిక్ భారత్ లోగోను ప్రదర్శిస్తున్నట్లు గుర్తించారు. అలాగే డాబర్ హోమ్‌మేడ్ కొబ్బరి పాలు ఉత్పత్తిని వంద శాతం స్వచ్ఛత అనే వాదనతో మార్కెట్లోకి వదిలారు. ఇలాంటి నిబంధనలు ఆహారాలకు వర్తించవని నిపుణులు చెబుతున్నారు.

హెచ్చరికలను బేఖాతరు

తప్పుడు ప్రచారాలను వెంటనే ఆపేయాలని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా గతంలోనే డాబర్ సంస్థకు నోటీసులు జారీ చేసింది. అయితే కంపెనీ వైపు నుంచి ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. హెచ్చరికలను పెడచెవిన పెట్టడంతో ఇప్పుడు నేరుగా నిషేధాజ్ఞలు జారీ చేయాల్సి వచ్చింది. ఈ పరిణామంతో మార్కెట్లో తీవ్ర కలకలం రేగింది.

పదిహేను రోజుల్లో నివేదిక

గుర్తించిన ఆహార ఉత్పత్తులతో పాటు తప్పుడు ప్రకటనలు చేస్తున్న మిగతా అన్ని ఉత్పత్తుల అమ్మకాలను తక్షణమే నిషేధించాలని డాబర్ ఇండియా లిమిటెడ్‌ను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశించింది. అంతేకాకుండా దీనిపై 15 రోజుల్లోగా చర్యల నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. ఆన్‌లైన్ మార్కెట్లలో విక్రయాలు జరుపుతున్న ఇతర సంస్థలపై కూడా నిఘా పెంచారు.

సోషల్ మీడియాలో హెచ్చరికలు

గత కొన్ని నెలలుగా వివిధ ఆహార వ్యాపార సంస్థలు, ఈ-కామర్స్ కంపెనీలపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సోషల్ మీడియా వేదికగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజలకు వివరిస్తోంది. ఇప్పటికే అనేక మద్యం తయారీదారులు, ఎనర్జీ డ్రింక్స్ కంపెనీలు కూడా ఈ నిఘా వలయంలోకి వచ్చాయి. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే ఎంతటి బడా కంపెనీలకైనా ఇదే గతి పడుతుందని స్పష్టమవుతోంది.